క్లుప్తంగా

క్రీడా దుస్తులు పంపిణీ

జడ్చర్ల టౌన్: డిగ్రీ కళాశాల స్టేడియం మైదానంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ, బీజేపీ అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్ శుక్రవారం టీషర్ట్స్‌ను పంపిణీ చేశారు. 30మంది వాలీబాల్ క్రీడాకారులకు టీషర్ట్స్ అందించినట్లు తెలియజేశారు. వాలీబాల్ క్రీడాకారులు టీషర్ట్స్ కావాలని అడగ్గానే అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు మధు, వెంకటేశ్, ఆనంద్, శ్రీను, విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంతోపాటు జానంపేటలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం ఏఓ అనిల్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ఎరువుల స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పాస్ మిషన్‌తోనే ఎరువులను విక్రయించాలని, గ్రౌండ్ స్టాక్, ఈపాస్ స్టాకు సరిపోయి ఉండాలని చెప్పారు. పీఏసీఎస్, ఇతర డీలర్ల వద్ద కలిపి మొత్తం 50 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, మరోవ్యక్తి బాలస్వామి గురువారం రాత్రి బైక్‌పై చక్రాపూర్ రోడ్డు నుంచి వస్తూ 44వ నంబర్ జాతీయ రహదారిపై జానంపేట వైపు వెళ్తున్నారు. కర్నూల్ రోడ్డుపై వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం బాలస్వామి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కృష్ణయ్యను ఆయన కుమారుడు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రమాదఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఆర్థిక సాయం అందజేత

భూత్పూర్: పట్టణంలోని అమిస్తాపూర్‌కు చెందిన రవికుమార్‌కు రూ.లక్ష నగదును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ అందజేశారు. రవికుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నవీన్‌గౌడ్ చికిత్స నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ కుటుంబ సభ్యులు నవీన్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నరేందర్, పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

బ్యాగుల వితరణ

దేవరకద్ర రూరల్: అన్నిదానాల్లో విద్యాదానం గొప్పదని దాత రామాంజనేయులు అన్నారు. తన జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం వెంకటాయపల్లి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవాబుపేట: విధులకు ఆటకం కలిగించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిద్దోటం కార్యదర్శి మహేందర్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ పాలకేంద్రం అనుమతికి దరఖాస్తు చేసుకోగా.. పరిశీలించి అనుమతిస్తానంటూ వివరించగా.. సమ్మతించకుండా పంచాయతీ కార్యాలయంలో విధుల్లో ఉన్న తనను అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేశాడని పేర్కొన్నాడు. పీఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపాడు.

భూమి కబ్జాపై ఫిర్యాదు

రాజాపూర్: మండలంలోని అగ్రహారం పొట్లపల్లిలో సర్వేనెంబర్ 44లో తమ ఆధీనంలో ఉన్న 19.27 ఎకరాల పట్టాభూమిని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య కబ్జా చేసేందుకు చూస్తున్నాడంటూ శుక్రవారం జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్‌కు పట్టాదారు సయ్యద్‌ఫయాజ్ ఉద్దీన్ ఫిర్యాదు చేశారు. తన తండ్రి స్వర్గీయ జయాముల్దీన్ 1969లో కృష్ణమాచార్యులు నుంచి డాక్యుమెంట్ నెంబర్ 3474/1989లో కొనుగోలు చేశారని, అప్పటి నుంచి మేమే పట్టా భూమిని అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. దొండ్లపల్లికి చెందిన కత్తెర కృష్ణయ్య మోహన్‌రావ్ అనే వ్యక్తిద్వారా ఏజీపీఏ చేసుకున్నాను అంటూ అక్రమంగా నా భూమిని కబ్జా చేసేందుకు చూస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ సమీపంలోని దుందుభీ వాగునుంచి శుక్రవారం మధ్యాహ్నం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మిడ్జిల్‌కు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

మహబూబ్‌నగర్ క్రైం: ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న షోకేస్ విగ్రహాన్ని ఢీకొట్టాడు. జిల్లా కేంద్రంలో బండమీదిపల్లి వైపు నుంచి మెట్టుగడ్డకు వెళ్తున్న ఓ ట్రాక్టర్ సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో రోడ్డు దాటుతున్న ఓ బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న బ్యూటిఫికేషన్ కోసం ఏర్పాటు చేసిన షోకేస్ విగ్రహాన్ని ఢీకొట్టడంతో ఆ విగ్రహం పూర్తిగా విరిగిపోయి కిందపడింది. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఇజాజుద్దీన్ వెల్లడించారు.

హాస్టల్.. హడల్

ప్రభుత్వ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. మౌలిక వసతుల కొరత వంటివి రాజ్యమేలుతున్నాయి. నాసిరకం ఆహారం.. పారిశుద్ధ్య లోపంతో విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్నిచోట్ల ముఖ్యంగా భవనాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎప్పుడో ఏండ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరి పైపెచ్చులూడుతున్నాయి. వర్షపు నీరు కారుతూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పెచ్చులు ఎప్పుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

- నవాబ్‌పేట




ఊచలు తేలిన ఎన్మన్‌గండ్ల హాస్టల్ భవనం

- పైపెచ్చులూడుతున్న ఎన్మన్‌గండ్ల హాస్టల్ భవనం
- ఏండ్లనాటి భవనం.. శిథిలావస్థకు చేరుకుంది
- భయం గుప్పిట్లో విద్యార్థులు, సిబ్బంది
- కొత్త భవనానికి ఎదురుచూపులు



ఎన్మన్‌గండ్ల బాలుర వసతి గృహం

మండలంలోని ఎన్మన్‌గండ్ల బాలుర వసతి గృహం చాలా అధ్వానంగా మారింది. ఎప్పుడో 30 ఏండ్ల క్రితం నిర్మించిన భవనం నేటికీ అలాగే కొనసాగుతుంది. ప్రతి ఏటా దానికి మరమ్మతులు చేయించి కాలం గడుపుతున్నారు. కాగా సగం గదులు పూర్తిగా ఊచలు తేలి ఉండగా మరి కొన్ని వాటికి డోర్లు, కిటికీలు లేవు. దీంతో విద్యార్థులు భయం గుప్పింట్లో కాలం వెల్లదీస్తున్నారు. దాదాపుగా 120మంది విద్యార్థులు ఉండే హాస్టల్‌లో గదులు మొత్తం పెచ్చులూడి పోతుంటే మరోపక్క కిటికీలు, డోర్లు ధ్వంససమై వానకు, గాలికి కాలం గడుపుతూ నిత్యగండంలా వారి దిన చర్య కొనసాగుతుంది. వానాకాలం అయితే చాలా పాములు, వాన నీటితో ఇబ్బందులు మామూలైపోయాయి. ఈ విషయంలో శిథిలావస్థలో ఉన్న వసతి గృహాన్ని బాగు చేయాల్సిన అవసరం ఉంది.



డోర్లు లేని భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిత్యం భయం గుప్పిట్లోనే..



ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. వర్షం వస్తే కురుస్తు, కిటికీలు, తలుపులు సైతం సరిగ్గా లేక కాలం గుడపుతున్న దైన్యం మాది. డోర్లు, కిటికీలు సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం, చలికాలం తీవ్రమైన ఇబ్బంది తప్పడంలేదు. కాస్మొటిక్ చార్జీలు గత విద్యాసంవత్సరంలో ఫిబ్రవరి వరకే ఇచ్చారు. గతంలో రెండు నెలలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

– చెన్నయ్య ,9వ తరగతి, బాలుర వసతిగృహం, ఎన్మన్‌గండ్ల

పాత భవనం డిస్మెంటల్‌కు ప్రతిపాదనలు

హాస్టల్ భవనం చాలా శిథిలంగా ఉంది. అందుకే తాజాగా పరిశీలించి దాన్ని పూర్తిగా డిస్మెంటల్ చేసేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తున్నాం. గతంలో మాదిరిగా రిపేర్లు చేస్తే భవనం కొనసాగుతుందన్న నమ్మకం కనిపించక పోవడంతోనే పాతభవనం తొగించాలని ప్రతిపాదనలు చేసేందుకు నివేదిక తయారు చేస్తున్నాం. ఒక వేల పాత భవనం డిస్మెంటల్ చేస్తే విద్యార్థులకు సమస్యలు రాకుండా తాత్కాలికంగా వేరే చోట నివాసం ఏర్పాటు చేసేలా చూడాల్సి ఉంటుంది.

– సునీత, సోషల్ వేల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్

ఖాళీ బిందెలతో జీపీ ఎదుట ఆందోళన

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం తాగునీటి ఇబ్బందులపై మహిళలు ఆందోళన చేశారు. గ్రామ సచివాలం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. తాము తాగునీటితో ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ కార్యదర్శి, తాగునీటి సిబ్బంది ఏం చేస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. కొన్నిరోజులుగా పోలేపల్లికి మిషన్ భగీరథ నీరు తక్కువగా సరఫరా అవుతుందని.. ఈ కారణంగానే తాగునీటి సమ్యలు తలెత్తుతున్నాయని భగీరథ సిబ్బంది మహిళలకు వివరించారు. త్వరితగతిన సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా తాగునీటిని సరఫరా చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని మహిళలు హెచ్చరించారు. కాగా గ్రామంలో సెజ్ పరిశ్రమల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ తాగునీటి సరఫరా కేంద్రం కూడా బంద్ కావడంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు.



పోలేపల్లి సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

వసతి గృహాల తనిఖీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను శుక్రవారం ఇండస్ట్రీయల్ శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, మండల ప్రత్యేక అధికారి జంగయ్య, ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మాస్టళ్లలో వసతి, సౌకర్యాలు, భోజనం గురించి విద్యార్థులతో అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి అల్పాహారం చేశారు. హాస్టల్‌లో శానిటేషన్ సమస్యలు వెంటనే పరిష్కరింపజేయాలని వార్డెన్‌లకు సూచించారు. సమీపంలోనే అద్దె భవనంలో ఉన్న ఇంటర్ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలోని అంశాలను కలెక్టర్‌కు నివేదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దవడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్కులు, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే వడ్డేమాన్ పాఠశాలకు రూ.20లక్షలు ముజూరు చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

గ్రామ పర్యటనతో సమస్యల గుర్తింపు

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్కిచర్లలో పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి పర్యటించారు. ప్రతిఇంటికి కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు ఆర్థికంగా, ప్రజలకున్న సమస్యలను గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇద్దరికి రిమాండ్

భూత్పూర్: ఏటీఎంలో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఏటీఎం వద్ద నిఘా ఉంచగా.. అనుమానాస్పదంగా ఉన్న మహారాష్ట్రకు చెందిన రోహిత్ ఓం శంకర్ అలియాస్ రోహిత్ శర్మ, ముకేష్ సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. భూత్పూర్, జహీరాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆశపడ్డాం.. భంగపడ్డాం

- అధికారంలోకొచ్చాక నిలువునా ముంచిన కాంగ్రెస్
- విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం.. రూ.4వేల ఫించన్ ఇస్తామన్నారు.. ఇలా ఎన్నికల్లో ప్రజలకు అమలుకాని హామీలను కాంగ్రెస్ గుప్పించడంతో అందరూ ఆశపడ్డారు.. చివరకు అమలు కాకపోవడంతో అందరం భంగపడ్డామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని, పథకాలు అందనివారు కాంగ్రెస్ హామీలకు ఆశపడి భంగపడ్డారన్నారు.

తిన్నింటి వాసాలు లెక్కగట్టేవారి వల్లే తన ఓటమి

బీఆర్‌ఎస్‌లో అక్కడక్కడా కొందరు తిన్నింటి వాసాలు లెక్కగట్టిన వారివల్లే తాను ఓటమి పాలైనట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఒకాయన బుద్ధిమంతుడు.. నోట్లో వేలేస్తే కొరకడని సూచిస్తే జెడ్పీటీసీని చేస్తిమి.. ఇప్పుడు పార్టీమారే ఎంలాభం.. ఇలా కొందరు పార్టీలో అక్కడక్కడా మోసపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. ఇలాంటివారి వల్ల పాఠాలు నేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని.. మళ్లీ మంచి రోజులు రానున్నాయని కార్యకర్తలకు భరోసానిచ్చారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ బాలరాజు, నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రోడ్డు ఏర్పాటు చేయాలి

దేవరకద్ర రూరల్: కొకుంట్ల శివారులోని అమ్మల్‌చెరువు కట్ట కింద నక్షబాటను సర్వే చేసి రోడ్డును ఏర్పాటు చేయాలని కొకుంట్ల రైతులు శుక్రవారం తహసీల్దార్ సుందర్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అమ్మల్‌చెరువు కట్ట నుంచి ముచ్చింతల చెరువు వరకు వెయ్యి ఎకరాలకుపైగా రైతుల పొలాలు ఉన్నాయని, ప్రస్తుతం చెరువుపై నుంచి వెళ్తున్న బాట ప్రమాదకరంగా ఉందని, రైతుల ఇబ్బందులను గుర్తించి, రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కిషన్‌రావు, నరేశ్, బుద్దారెడ్డి, నర్సింహులు, కొండన్న, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి

హన్వాడ: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతుభరోసాను కౌలురైతులకూ వర్తింపజేయాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కిష్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగన్న, బుచ్చన్న, వెంకటయ్య, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలని బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం 42శాతం ఆర్డినెన్స్ ఇవ్వడంతో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో లాభం చేకూరుతుందని చెప్పడం చూస్తుంటే బీసీలను మళ్లీ మోసం చేయడమేనన్నారు. రాజ్యాంగంలో 9వ సవరణ చేస్తే 42శాతం రిజర్వేషన్ అమలు జరుగుతుందన్నారు. కేంద్రం కూడా పార్లమెంట్‌లో బిల్లు పెట్టే విధంగా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలకు మంచి రోజులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడలకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు 10 వేల చెస్ బోర్డులను పంపిణీ చేసే కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ బోర్డులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అవకాశం ఉంటే విద్యార్థులకు చెస్ క్రీడలో శిక్షణ తరగతులతోపాటు పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు మనోహర్, ఎన్‌ఆర్‌ఐ ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, శ్రీధర్, రాఘవేంద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రజక సంఘం సభ్యులు

స్థానిక కార్పొరేషన్ పరిధిలోని ఎదిర రెవెన్యూ డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేసినందుకు రజక సంఘం సభ్యులు ఆయనను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లంగారి భరత్‌కుమార్, బి.శ్రీనివాసులు, విజయ్‌కుమార్, మోహన్, రవికుమార్, నాని, శ్రీకాంత్, మల్లేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఐబీఎం సంస్థతో జేపీఎన్‌సీ ఒప్పందం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రతిష్టాత్మక ఐబీఎం సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులకు ఐబీఎం సంస్థ సాంకేతికరపరమైన శిక్షణ ఇవ్వనుంది. దీంతో విద్యార్థులకు ఉద్యోగపరమైన నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

ట్రాయ్ ఆధ్వర్యంలో అవగాహన

జేపీఎన్‌సీ కళాశాలలో శుక్రవారం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఇండియన్ టెలీకం సర్వీస్ జాయింట్ అడ్వయిజర్ సురేశ్‌బాబు హాజరై ట్రాయ్ దేశంలో ప్రజలకు అదించే టెలీకాం సేవలు, సెల్ టవర్ల వినియోగం, మోసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నితిక, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు నవాజ్ అలీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వతంత్రం రాకముందే కోయిల్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ వంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణానికి కృషిచేసిన గొప్ప దార్శనికుడు నవాజ్ అలీ మీర్ బహదూర్ జంగ్ అని ఇరిగేషన్ సర్కిల్ –2 ఎస్‌ఈ ఉదయ్ శంకర్ అన్నారు. జంగ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జలసౌధలో మీర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవాజ్ అలీ గొప్ప ఇంజనీరింగ్ ప్రతిభ ఉన్న వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, ఈఈ కృష్ణమోహన్, మధు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, విజయక్ష్మి, ఏఈఈలు మహేందర్‌రెడ్డి, భద్రునాయక్, గాయత్రి, శిప్ప మానిక్యం నాయక్, సురేశ్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.



మీర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

బీసీ రిజర్వేషన్లపై సంబరాలు

గండీడ్: కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లు కేటాయించడంపై మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. దీనివల్ల బీసీలకు అన్నింట్లో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, ఆంజనేయులుగౌడ్, గోపాల్, మన్నెపురెడ్డి, తిరుపతయ్య, వెంకటయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకొంటున్న నాయకులు

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



మిడ్జిల్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మిడ్జిల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జనాభాను అరికట్టేందుకు ఒక్కరు, లేదా ఇద్దరు పిల్లలు చాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకాంత్, సీహెచ్‌ఓ అయ్యూబ్‌ఖాన్, ప్రసాద్, దేవయ్య, జంగయ్య, గీతా, పద్మ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కామిక్ రచన పోటీలు

జడ్చర్ల టౌన్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో కామిక్ రచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో 6–10 విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రత్యేక అంశంగా చాలా ఆలస్యం కాకముందే వద్దు అని చెప్పండి దానిపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాదేపల్లి బాలుర జెడ్పీహైస్కూల్‌కు చెందిన లహరిశ్రీ ప్రథమ స్థానం సాధించగా జిల్లాస్థాయి పోటీలకు పంపినట్లు ఎంఈఓ మంజులాదేవి, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మి, సోషల్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

సైన్స్ ప్రదర్శన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో శుక్రవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా కల్తీ పదార్థాలను గుర్తించడం, అయస్కాంతాలు, ధ్వని పనితీరు విధానంపై ప్రదర్శనలిచ్చారు. ప్రిన్సిపాల్ గోవిందరాజులు, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టాలి

దేవరకద్ర రూరల్: లక్ష్మీపల్లి బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2017లో వేముల స్టేజ్ నుంచి లక్ష్మీపల్లి, హజిలాపూర్, చౌదర్‌పల్లి మీదుగా 167వ జాతీయ రహదారిని కలిపేందుకు 17కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డు వేసేందుకు అప్పటి ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని, టెండర్ దక్కించుకున్న కంపెనీ పనులను ఆదిలోనే నిలిపివేశారని తెలిపారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

బైలెల్లిన పోచమ్మ బోనం



గండీడ్/మహమ్మదాబాద్: గండీడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉమ్మడి మండలంలోని వెన్నాచేడ్, పెద్దవార్వాల్, సాలార్‌నగర్, మహమ్మదాబాద్ తదితర గ్రామాల్లో ఉదయం పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీపివంటకాలతో నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని మహిళలు సామూహికంగా బోనాలతో ఊరేగారు. శివసత్తుల పూనకాలతో అమ్మవారి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోడిపుంజులు, మేకలను పోచమ్మకు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

చైతన్య యాత్రకు స్వాగతం

అడ్డాకుల: విశ్వకర్మ విజ్ఞాన సెంటర్ చైర్మన్ విశ్వంతుల పుష్పగిరి ఆచార్యుల బృందం చేపట్టిన విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర శుక్రవారం మూసాపేట మండలంలోని జాతీయ రహదారిపై కొనసాగగా మూసాపేట విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. ఈనెల 6న 11మందితో హైదరాబాద్‌లో మొదలైన పాదయాత్ర ఈనెల 27న మఠం చేరుకుంటుందని పుష్పగిరి ఆచార్యులు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాసులు, సుధాకర్, కొండాపురం శ్రీను తదితరులు ఉన్నారు.

కాకర్లపహాడ్‌లో బోనాలు

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌లో శుక్రవారం ఆషాఢబోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి బోనాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

పాలమూరు/మహబూబ్‌నగర్ రూరల్: బీజేపీ మహబూబ్‌నగర్ మండల కమిటీని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగన్న, మండల ప్రధాన కార్యదర్శులుగా రాఘవేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శంకరమ్మ, సత్యారెడ్డి, నాగభూషణంను నియామించి నియామకపత్రం అందించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

అపరిశుభ్రతతో వ్యాధులు

భూత్పూర్: ప్రతిఇంటి పరిసరాలను అపరిశుభ్రత, ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉంచడడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 1వ వార్డులో వందరోజుల ప్రణాళికలో భాగంగా డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మొబైల్స్‌తోనే సైబర్ నేరాలు

దేవరకద్ర: మొబైల్ ఫోన్‌లతోనే 80శాతం సైబర్ నేరాలు నమోదవుతున్నాయని ఎస్‌ఐ నాగన్న తెలిపారు. శుక్రవారం కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.